కథ

హాస్పిటల్ - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన శృంగార కథ

# పువ్వులు

రాజా

విజయనగరమంటే - కన్యాశుల్కం.
విజయనగరమంటే - కంతశాల.
విజయనగరమంటే - ద్వారం.
విజయనగరమంటే - కళావర్‌రింగ్.

విజయనగరమంటే - హరికథల దాసు, హరికథ|ల చాసో.

విజయనగరమంటే - కళలు ... రసికత.

విజయనగరమంటే - విశాఖ సంపెంగలూ, సాలూరు మల్లెలూ, మందవలస మొగలిపూలూ.

విజయనగరమంటే - తొండాల దోమలూ, అందాల భామలూ.

విజయనగరంలో ఇప్పటికీ - కథలు చెప్పడమూ, రాయడమే కాదు, నడుపుతారు కూడా.

విజయనగరమంటే - విచిత్రాల మయం.

***

గంట స్థంభం దగ్గర - గజ్జెల గుర్రాల్లాంటి ముగ్గురు ముద్దుగుమ్మలు. ముగ్గురూ మూడు చోట్ల నుంచి వొస్తే ఏం? మూడు రోజుల్లోనే ముప్పేరు దండలా కలిసిపోయారు. రేపు పిల్లలకి పాఠాలు చెప్పడానికి - యివ్వాళ శిక్షణ పొందుతున్నారు. ఓ యిల్లు తీసుకుని - వొండుకుతింటూ ఉంటూ చదువుకుంటున్నారు.

కళాశాలలో ... వారంలో ... వీళ్లొక సాంస్కృతిక ప్రదర్శనమివ్వవలసి వుంది. 'ఆధునిక మధురవాణి' అని ఆ నాటికలాటి కార్యక్రమం పేరు. స్త్రీ దృష్టిలోంచి సమాజ చిత్రణ - కథా వస్తువు.


రాసినది - ఆ ముగ్గురిలోని అమ్మయే. పేరు... రాసింది కనుక రచన.

నటించేదీ - ఆ ముగ్గురిలోనిదే. పూలజడమ్మాయి... కనుక... పూలజడ.

దర్శకత్వం - మూడో అమ్మాయి. అంచేత ఆ అమ్మాయి పేరు - దర్శ.

గంటస్థంభం అంటే - మద్రాసులో మూర్ మార్కెట్. ఇప్పుడైతే మద్రాసు పోయి చెన్నై అయింది. మూర్ మార్కెట్ పోయి - ఇంకేమీ అవలేదు. సెంట్రల్ స్టేషనులో కలిసిపోయింది. కానీ... గంటస్థంభమూ బజారూ ఏమీ అవకుండా అలాగే ఉన్నాయి. అక్కడేవో కొనుక్కుందుకువొచ్చి... తిరుగుముఖం పట్టి - మూడు లాంతర్ల సెంటరు వేపు నడుస్తున్నారు.


దీపాలుపెడుతున్నవేళ. బజారు దివ్యంగా వెలుగుతోంది. రోడ్డు పక్క దుకాణాలు రద్దీగా ఉన్నాయి. రోడ్డు కిక్కిరిసి ఉంది. పనున్నవాళ్లూ లేనివాళ్లూ కూడా పైనే ఉండే వేళ అది. అంత రద్దీలో కూడా పూలజడ అమ్మాయికి కొంచెం దూరం పాటిస్తున్నారు రచన, దర్శ. ఆమె నడక కి జడ ఉయ్యాలలూగుతోంది - పిరుదుల హద్దుల్లో. అది మొగిలిరేకుల జడ. తగిలిందంటే చుర్రుమంటుంది. ములు - మొగిలిదయినా, గులాబిదయినా గుచ్చుకునే గుణం పోదు కదా?



అందమైన అమ్మాయిలతో రోడ్డు కలకల లాడిపోతూంది. షాపుల్లోంచి విద్యుద్దీపాల కాంతి, దూకాణాల గ్యాస్ లైట్ల కాంతీ వాళ్ల అందాలను మరింత వెలిగించి చూపుతున్నాయి. బెల్లానికి చీమలు పట్టడమైనా మరచిపోవచ్చునేమో కానీ,

అందమైన అమ్మాయిలను ముసురుకోవడం అబ్బాయిలు మానరు. ఎక్కడ అమ్మాయిలుంటారో అక్కడ అబ్బాయిలుండి తీరడం - ప్రకృతి ధర్మమూ, సూత్రమూ కూడా.

రోడ్డు పక్క- పూలదుకాణం. రాశులుగా పోసిన మల్లెలు. గుట్టలుగా పోసిన సంపెంగలు.



వాటినుంచి ఆహ్లాదకరంగానూ మత్తెక్కిస్తూనూ వొస్తున్న పరిమళాలు.

ఆ దుకాణం ముందొక యువకుడు - వీటినే చూస్తూనూ, ఆ సువాసనలే పీలుస్తూనూ... మైమరచిపోయినట్లున్నాడు. అన్ని పూలని అలా చూస్తుంటే వెర్రెత్తి పోతుందేమో. నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

పూలమీద మధ్య మధ్య నీళ్లు జల్లుతూ - "పువ్వులు కొనండి బాబూ... నవ్వులు పండించుకోండి. సాలూరు మల్లెలు.. రెండు మూరలూ మూ(డూపాయలే. సింహచలం సంపెంగలు రూపాయికి ఐదు.. మొగిలి పువ్వు - బుట్టి రూపాయ్... కొనండి - " కొనకపోతే కదులు - అన్నట్లు చూశాడు కొట్టువాడతనివేపు.

అవమానంగా అనిపించి - పది రూపాయల నోటు వాడిమీదకి విసిరాడు. "వొచ్చినన్నీ కట్టేయ్."

"అదీ! అద్గదీ.. అలా ఉండాలి రసికతంటే. రేతిరికి రంజేరంజు. పువ్వుల పొట్లాం అందివ్వడమేమిటి, యిల్లాలు డైరెట్టుగా పడకగదిలోకే దారితీస్తుంది." పదిరూపాయల బేరమొచ్చిన సంతోషంలో కాబోలు..." పువ్వులంటే దంపతులకి ఉషారు... కవులకి కవిత్వం..." అని దండకం చదివి పెద్ద పొట్లాం అందించాడు.

అనుకుంటూ... అతనొక నిట్టూర్పు విడిచాడు.

అంతలో... అతనిని దాటి వెళ్తూ... వాళ్లు... ఆ ముగ్గురమ్మాయిలు.

అతని దృష్టిని ఆ పూలజడ లాగేసుకుంది. కట్టేసుకుంది. ఆకట్టేసుకుంది. ఒక్కసారతనిలోకి చైతన్యం. ఏదో ఆశ.

అతను వారిననుసరించ సాగాడు కలల్లో తేలిపోతూ వాళ్ల వెనకే నడవసాగాడు.

ఆ పూలజడ - ఆమె పిరుదలమీద అటూ ఇటూ ఊగుతూంటే - తలకిందులుగా కొమ్మకి వేలాడే గోధుమ నాగు పడగెత్తి నాట్యం చేస్తున్నట్లే ఉంది. ఆ జడ ఎంత అందంగా ఉంది మొగలిరేకులతో! ఎంత చక్కని వాసన! కళాత్మకంగా ఉందా పూలజడ. మొగలిరేకులు... మధ్య మధ్య గులాబులు.... సంపెంగలు... దిగువ మల్లెపూల బంతులుగా విడింది.

"వీపుమీద చూపులు తూపుల్లా గుచ్చుకుంటున్నాయా -" అంది పూలజడ.

"ఊ. బాడీగార్డ్ తగులుకున్నట్లున్నాడు.

"ఎవరికో?"

"ఇంకెవరికి? పూలజడా! నీకే. వెనకనుంచి కదా..."

"ఔనౌను."

"కాని... నాకంటే నువ్వే అందగత్తెవి."

"అలాగే అనుకున్నా - అతగాడు - వెనక ప్రేమికుడు కదా! అంచేత నీకే లైనేస్తూ..

"ఐతే ఏంటటా?"

"వాడు మనని శివాలయం వీధి బాపతనుకుంటున్నట్లున్నాడు.."

"మనమూ అలాగే అనుకుని ఆటాడుకుంటే?"

"ఆట పట్టించాలి."

"ఔను. రేపు నటించబోయే పాత్రకి - రిహార్సల్. రెడీయేనా పూలజడా?"

"ఓ. నీకు నా మీద నమ్మకం కుదరడం లేదు -

నేను స్టేజీమీద భయపడను తల్లీ అని ఎంత మొత్తుకున్నా. ఇది లైవ్ షో ఔతుంది. దీనిలో గెలిస్తే నా మీద నమ్మకం ఉంచుతావా?

"ఆ."

కొంతదూరం నడిచారు.

మూడు లాంతర్లు దాటి... ఫూల్ బాగ్ వేపు రోడ్డుమీద - మలుపు తిరిగి చిన్న రోడ్డు పట్టారు. ఐనా అతను వారిననుసరిస్తూనే ఉన్నాడు.

దర్శ ఒక్కసారి వెనక్కి తిరిగి - "హాయ్" అంది యాంకీ స్టయిల్‌లో.

ఒకవేపు చెమటలు పట్టేస్తున్నా... గొంతు తడబడుతున్నా - అతనూ - "హాయ్" అన్నాడు అమెరికన్ గైలా.

"మా వెంటపడుతున్నావా?"

"ఊ... ఊహూ..."

"చలి జ్వరమా?"

"అహ."

"డాంగు?"

"కాదు. అయామ్ పర్‌ఫెక్ట్‌లీ ఆల్ రైట్."

"మరి?"

"నేననుసరిస్తున్నది మిమ్మల్ని కాదు" కొంచెం ధైర్యం తెచ్చుకున్నాడు.

"ఇంకెవరిని?"

"పూజని."

"మాలో పూజెవరూ లేరు."

"ఎదురుగా... ఐమీన్ ... పక్కనే పెట్టుకుని పచ్చిబద్దం ఆడతారేం?"

"అదీ... దాని పేరు పూజకాదు."

"నేను పేరనలేదు. పేరు తెలియదు కనుక ఆమె గుర్తింపు - పూలజడ.

పూలజడకు పొట్టిపేరు - ఆక్రొనిమ్ - పూజ."

మరి మేక కాదు - అనుకున్నారు వీళ్లతని చమత్కారం అర్థమై.

"గంటుంటావా, నైటంతానా?" అడిగింది దర్శ.

రాస్కెల్! ఎంత పచ్చిగా అడుగుతూందో నిజమైన సానిలా! దీనికివన్నీ ఎలా తెలుసో? - అనుకున్నారు మిగిలిన యిద్దరూ.

"గంట చూసి... తరువాత చెబుతాను -"

"ఒట్టి చూపుల మగాడివా! చూడ్డానికేనా మరిదేనికేనా గంటకైదు వందలు. నైటంతా అయితే పదిహేనువందలు. నైటంటే - తెల్లారేవరకూ అనుకునేవు. సెకండ్ షో అవడం లెక్క. అంటే - రెండు గంటలు.."

"సరే" అని జేబులోంచి ఐదువందలు తీసిచ్చాడు.

"ఒకమాట. పూజకిలాటివి కొత్త. జాగ్రత్తగా చూసుకోవాలి. గ్లాస్... హాండిల్ విత్ కేర్..."


"పువ్వులా చూసుకుంటాను.."

"ఆడవాళ్లంటేనే పువ్వులు."

"మీరన్ని షరతులు పెట్టారు. నేనొక్క షరతు పెడతాను. కాదనకూడదు -"

"ఇక మీరిద్దరూ ఒకటి - గంటవరకూ. అదేదో దానికే చెప్పుకోండి. ఇదే మా యిల్లు. ముగ్గురికీ మూడుగదులు. మేము చాలా గౌరవంగా బతికేవాళ్లం. మీరేమైనా గొడవ చేశారో.." హెచ్చరించింది దర్శ.

"నేను మరీ గౌరవనీయుణ్ని. మీ ఫ్రెండ్‌కేమీ ప్రమాదం, యిబ్బందీ కలగజెయ్యను -"




"ప్రామిస్!"

"థాంక్యూ." చెప్పేసింది తను ప్రామిస్ అనేలోగానే.

అందరికంటే ఆఖరున అతను యింట్లోకి నడిచాడు.

"మీరేదో షరతన్నారుట?" అడిగింది పూజ.

పూలజడ తీసెయ్యకండి, చికాకేస్తూందని. తరవాయి - గదిలో."

"సరే. ఐదు నిముషాల్లో పొద్దురుగాని." అని హాలులో కూర్చోబెట్టి గదిలోకి వెళ్లింది.

ఆమె మొహం కడుక్కుందుకు వాళ్లిద్దరూ జడవిత్తి పట్టుకున్నారు.

"చిత్రా! మేము సిద్ధంగా అప్రమత్తంగా ఉంటాం. నువ్వు ఊళెయ్యడమేమిటి, గదిలో కురుకుతాం. ఒకరు పచ్చడి బండా.. మరొకరు కారం గుండా మారణాయుధాలతో. నీకేమీ భయం లేదు, ధైర్యంగా ఉండు."

"అబ్బబ్బ! నాకు తెలుసే, నేనేమీ ఉరికంబమెక్కడం లేదు. మీరు నన్ను పిరికి మందు పోసి చవటని చెయ్యకపోతే నేను చక్కగా నిర్వర్తిస్తాను."

"అది కాదే. ఎంతయినా మనం చేస్తున్నది దుస్సాహసమూ, వెధవపనే. ఎట్నించెటొచ్చినా..."

"ఎటునుంచెటూ రాదు కానీ మీరిక నన్నొదలండీ." అంది చిత్ర ఉరఫ్ పూజ.

ఎందుకే నీకింత తొందరా - పాటందుకుంది ఫ్రెండ్.

పోయిరా మాయమ్మ... పోయిరావమ్మా... అంటూ ఆమెను గదిలోకి సాగనంపారు. "తలుపు మూసిన దగ్గరనుంచీ మళ్లీ బయటకొచ్చేవరకూ గదిలో జరిగినదంతా సినిమాలా చెప్పాలి సుమా -" అని హెచ్చరించి.

అప్పటికే అతనాగదిలో... మంచం మీద కూర్చున్నాడు.

పూజ ప్రవేశించడం చూసి - లేచి నిలుచున్నాడు.

"స్వాగతం. సుస్వాగతం."

అంతవరకూ ఉన్న ధైర్యం ఒక్కక్షణంలో ఏమైపోయిందీ... ఎంత మేకపోతు గాంభీర్యం నిలుపుకుందామన్నా కుదరలేదావెంకు. మాటలకీ, చేతలకీ, ఊహకీ, వాస్తవానికీ ఉన్న తేడా తెలియసాగింది.

ఒంటరిగా చాలామంది పిరికివాళ్లే. ఆమెకు చెమటలు పోసెయ్యసాగాయి. "థాంక్స్." కూడా సరిగా చెప్పలేకపోయిందతని స్వాగతానికి.

"మీరు భయపడుతున్నట్లున్నారు..."

"లేదు-" అనలేదామె.

"భయపడడం అనవసరం. నేను మిమ్మల్నేమీ చెయ్యను. కౌగిలి... ముద్దు... అంతే."

"నిజంగా?" అన్నట్లు చూసింది భయపడుతూనే, తలెత్తి.

"వాగ్దానం చేస్తున్నాను. కావాలంటే ఒట్టేస్తాను. నిజంగా నేను మిమ్మల్ని కౌగలించుకోవడం, ముద్దుపెట్టుకోవడంకంటే ఏమీ చెయ్యను -"

ఆమె అనుమానంగా చూసింది.

"ఎయిడ్స్ భయమనుకునేరు? ఎంత మాత్రమూ కాదు. నిరోధ్ గురించి నాకు బాగా తెలియనూ తెలుసు, అదంటే నమ్మకమూ ఉంది. ప్రభుత్వం - ఎయిడ్స్‌కీ, నిరోధ్‌కి తక్కువ ప్రచారం యివ్వలేదు -"

వీళ్ల మాటలు బయటినుంచి వినగలుగుతున్న స్నేహితురాళ్లిద్దరిలోనూ రచన గొణిగింది. "జో కొ

- కా బో లే ...."

"అంటే?"

"తిరగేసుకో."

"జ్జో కా ... కొజ్జా... అలా కనవడడే..."

"చూడు చూడు... అతను పువ్వుల పొట్లాం విప్పుతున్నాడు -"

"పువ్వుల వున్నయ్యన్నమాట. ఇంక కిటికీ మూసెయ్... అతను చూస్తే బాగుండదు."

"అతనటువేపు తిరుగున్నాడు. అదీ కాక - యింకా సెన్సార్ కావలసిన దృశ్యాలు మొదలవలేదుగా. ఇద్దరూ ఫుల్‌డ్రెస్‌లో ఉన్నారు -"

"పూజా! మీరీ పువ్వులు పెట్టుకొండి. ఒక్కటి కూడా మిగలకుండా -" అర్థిస్తున్నట్లే అన్నాడతను.

"పూలజడుందిగా..." ఎలాగో గొంతు పెగల్చుకుందామె.

"ప్లీజ్ ... నేను కోరే కోరిక యిదే. అనుమతిస్తే నేనే అలంకరిస్తాను."

ఆమె వొద్దనలేదు. అతను ఆమె తలలో పూలు ముడిచాడు. మెడలో దండవేశాడు. చేతులకీ, కాళ్లకీ గాజులు, పట్టీలమీద పూలదండలు చుట్టాడు. నడుముకి పూలవడ్డాణం పెట్టాడు. చిట్ట చివరి పువ్వుకూడా అలంకరించేశాడు.

"చూడు చూడు. పువ్వుల పిచ్చోళ్లా ఉన్నాడు. చిత్ర... పూబాల లాగే వుంది. పువ్వులతో చేసిన బొమ్మలా ఉంది - ఆ సువాసనలిక్కడ కొచ్చేస్తున్నాయి. హా..."

"ఉష్! అరవకే తల్లీ. అసహ్యంగా ఉంటుంది వాళ్లు వింటే..."

అతనామె కొకటి రెండడుగులు దూరంగా వెళ్లి నిలుచున్నాడు. పూజాని కళ్లారా చూసుకున్నాడు. తదేకంగా ఒకటి రెండు నిముషాలు చూశాడు.

పూజకేమీ అర్థం కావడంలేదు. తెల్లబోయి చూస్తుంది. హఠాత్తుగా అతనామెను కౌగలించుకున్నాడు - పువ్వులమీదే. ఆమెను ముద్దులు పెట్టుకున్నాడు. అతనామెనెంత గట్టిగా కౌగలించుకున్నాడో ఏమో... ఆమె వొంటిమీద పువ్వులు సగంపైన రాలిపోయాయి. ఇప్పుడామె చిత్రంగా అదో అందంగా ఉంది.

ఆమెను రెప్పవేయకుండా ఓ నిముషంపాటు పరిశీలనగా చూశాడు, చిత్రకారుడు తాను గీయబోయే చిత్రం మాడల్‌నిలా.

చటుక్కున కౌగలించుకుని ముద్దుల్లో ముంచెత్తాడు.

"థాంక్స్ పూజగారూ! నేను వెళ్తాను. గుడ్‌నైట్... థాంక్యు అగన్.." ద్వారంవేపు అడుగులు వేయబోయాడు.

గదిలో పూజ ... కిటికీ యివతల వాళ్లిద్దరూ ... ముగ్గురూ తెల్లబోయారు... ఏమీ అర్థం కాక.

"ఆగండి -" కొంచెం గట్టిగానే పిలిచింది పూజ.

వెళ్లబోతున్న అతనాగి - వెనక్కి తిరిగి ఆమె వేపు చూశాడు.

ఏమడగాలో తెలియలేదామెకు. అయినా - "మీరు ఐదు వందలిచ్చింది - ఈ మాత్రానికేనా?" అనేసింది.

ఈ మాత్రమని తక్కువగా భావిస్తున్నారా నాకు మీరందించిన మహత్తర అనుభవాన్ని! ఇదెంత గొప్పదో! మీరు ప్రసాదించిన అద్భుతమయిన ... అందమైన అనుభవం నీ జీవితాంతమూ గుండెలో ఉండిపోతుంది. దీనికోసం నేనెన్నాళ్లనుంచీ ఎంత యిదిగా కొట్టుకుంటున్నానో."

"మీరు... నా కర్థం కావడంలేదు... కొంచెం వివరంగా చెబితే..."

అతను వాచీ చూసుకున్నాడు. "గంటకి యిక పది నిముషాలే ఉంది."

"ఫరవాలేదు."

"సరే." అని కుర్చీలో కూర్చుని "నాదొక చిత్రమయిన... జాలిపడవలసిన జీవితం. పైవాళ్లకి నాది పీత కష్టంలాగే కనిపించొచ్చు." అంటూ మొదలుపెట్టాడు.


లివర్ ఎలర్ట్ !

ఆరోగ్య వంతమైన కాలేయం (లివర్) మీకు ఎంతో అవసరం!

కాలేయం చెడిపోవడానికి కారణాలు ఏమిటి?
- అతిగా మద్యం సేవించడం
- వైరస్ సోకడం
- అనవసర మందుల వాడుక

ఇది ఎంత ప్రమాదకరం?
- కాలేయం శాశ్వతంగా కృశించిపోవచ్చు
- కాలేయం వైఫల్యం చెందవచ్చు
- కాలేయ క్యాన్సర్ రావచ్చు

దీన్ని అరికట్టేందుకు మీరేం చేయవచ్చు?
- రోజువారీ జీవన విధానంలో మార్పు
- పరిమితంగా మద్యపానం
- అనవసర మందులు ఆపడం





కాలేయ సమస్యలకు తక్షణచికిత్స అవసరం!

వెంటనే కాలేయ వ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణులను (లివర్ స్పెషలిస్టు) సంప్రదించండి !!

EMERGENCY 24 Hrs SERVICE

ఎన్నో ప్రత్యేకతలు కలిగినది గ్లోబల్ హాస్పిటల్స్
- ప్రత్యేక లివర్ క్లినిక్
- లివర్ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ (మార్స్ తో లివర్ డయాలసిస్)
- కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సకు అనువైన వ్యవస్థ
- అత్యాధునిక డయాగ్నస్టిక్ మరియు ఇమేజింగ్ సౌకర్యాలు
- సుశిక్షితులైన, స్పెషలిస్టు డాక్టర్లు

లివర్ చెకప్‌లో చేసే పరీక్షలు
- లివర్ ఫంక్షన్ టెస్ట్
- జి.జి.టి.
- యాంటి హెబిసి
- యాంటీ హెచ్ సి వి
- ప్రోథ్రాంబిన్ టైమ్
- హెబిస్ ఏజి
- అల్ట్రాసౌండ్ - అబ్డోమిన్
- కాలేయ నిపుణులు, ఆహార నిపుణులతో సంప్రదింపులు

EXCELLENCE THROUGH TEAM WORK

సంప్రదించండి ఫోన్ : 23234567

అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలకోసం ప్రత్యేకంగా దేశంలోనే ప్రప్రథమంగా ఏర్పాటైన గ్లోబల్ హాస్పిటల్స్ ఇప్పటికే కాలేయం, మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు ఎన్నో విజయవంతంగా చేసింది.

గుర్తింపు :
ఇ.ఎస్.ఐ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏ.పి. ట్రాన్స్‌కో, ఏ.పి.జెన్ కో, సి.పి.డి.సి.ఎల్ బి.డి.ఎల్, ఎన్.ఎం.డి.సి

గ్లోబల్ హాస్పిటల్స్

సి.జి.హెచ్.ఎస్, ఆరోగ్య భద్రత, దక్షిణమధ్య రైల్వే, సింగరేణి కాలరీస్ మరెన్నో ప్రముఖ సంస్థలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజి, లివర్ డిసీజస్, రీనల్ డిసీజస్, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ, కొలోరెక్టల్ సర్జరీ, అంకాలజీ, జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్

లకడీకాపూల్, హైదరాబాద్ - 500 004 ఫోన్: 040 - 23244444 (10 లైన్లు) ఫ్యాక్స్ : 23244455 వెబ్ సైట్ : www.theglobalhospital.com

TIME & SPACE

"ఏ మనిషికేది యిష్టమో - దాని వెనుక కారణాలుండక్కర్లేదు...."

"ఔను. ఇష్టాలకీ, నమ్మకాలకీ హేతువు తప్పనిసరేమీ కాదు -"

"చిన్నప్పటినుంచీ నాకు పువ్వులంటే యిష్టం. నా తలలో పువ్వులు పెట్టమని అమ్మని అల్లరి పెట్టేవాడినట. ఇదేమిట్రా, మగపిల్లాడివై ఉండీ ఆడపిల్లలా పువ్వులు పెట్టుకుంటానంటావూ - అని విసుక్కునేదటావిడ. పెద్దయినా నాకు పువ్వుల వెర్రి పోలేదు. ఇంట్లో ఎన్నో ఫ్లవర్ వాజ్‌లు చేర్చేవాడిని. వాటిలో పువ్వులు నింపేవాడిని. బొకేలు ... దండలు... దొరికితే చాలు పూలూడదీసి వాజ్‌ల్లో అమర్చేవాడిని. బ్రహ్మచారిగా ఉన్నా రోజూ రాత్రి పూలు కొని పక్కమీద జల్లుకునేవాడిని. ఏకాలానికాపూలు..."

ఆశ్చర్యంగా వింటున్నారు - పూజా, వాళ్లిద్దరూ.

"పెళ్లిమీద ఆడపిల్లలకే కాదు మగాళ్లకీ కలలుంటాయి. ఊహలుంటాయి."

"ఎందుకుండవూ? మగాళ్లు మాత్రం మనుషులు కారా ఏం..."



"నా పెళ్లి కల - భార్య సినిమాతారలా ఉండడం కాదు. తలనిండా ... వొంటినిండా పూలు పెట్టుకుని .. వెన్నెల్లో ...నా కౌగిలిలో కరుగుతూ శృంగార సౌఖ్యం కలిగించాలని.. కేవలం పూలమాలలనే చీరలా చుట్టుకుని ... సౌందర్యాలూ, సువాసనలూ విరజిమ్మాలని. నా భావనలో పూలచీరలంటే - పూలమాలలనే చీరలా ధరించడం - వస్త్రం లేకుండా. ఓ! సారీ... నేను... మీరాడపిల్ల అని మరచి సిగ్గుమాలిన విషయాలు చెబుతున్నట్లున్నాను."

"లేదు. లేదు. చెప్పండి. చాలా చిత్రంగా ఉన్నాయి మీ మాటలు. పుర్రెకో బుద్ధి, జిహ్వకోరుచి అని అననే అన్నారు కదా. ఐనా మీ కోరిక ఎవరికీ అపకారం చేసేదేమీ కాదు -"

"నాకు పెళ్లయింది.." అతను నిట్టూర్చాడు. "జీవితమంటేనే కాదు, పెళ్లన్నా అనుకున్నవి కాకపోడమే ఏమో. చిన్న చిన్న కోరికలు కూడా అందరాని చందమామలై ఏడిపించడం.."

"ఏమైంది?"

"కొంచెం స్తిమితపడ్డాక అడిగాను మా శ్రీమతిని - "పువ్వులు పెట్టుకోవేం తలనిండుగా? మొక్కుబడికన్నట్లు ఏదో ఓ పువ్వు... వాసనలేనిదీ, అందంగా లేనిదీ పెట్టుకుంటావేం?"

ఆమె మాట్లాడలేదు.

"జవాబు చెప్పు. నేను ప్రతి సాయంత్రమూ పూలు తెస్తున్నాను. కాని నువ్వు పెట్టుకోడం లేదు. ఇప్పటికి నువ్వూ నేనే ఉండగలుగుతున్నాం కనుక.. కొంత చనువేర్పడింది కనుక... చెబుతున్నాను. నాకు పువ్వులంటే యిష్టం. వెర్రే అనుకో. పూలు పెట్టుకుంటుందనే నేను పెళ్లిచేసుకున్నానేమో. పూలుపెట్టుకునే అదృష్టవంతులని నేను ఆడవాళ్లమీద అసూయకూడా పడుతుంటాను. స్త్రీ అంటే కదిలే పూలచెట్టు నా దృష్టిలో. తలనిండా పూలతో కనపడుతూంటే నాకు నీ మీద ఎంతో యిష్టం పెరుగుతుంది -"

"కాని... నాకు... పువ్వులంటే... ఎలర్జీ! మల్లె... గులాబి... సంపంగి... ఏ పూలు పెట్టుకున్నా పడవు. రాష్ వొచ్చేస్తుంది. ఆ వాసనకి ఆయాసమూ, దగ్గూ వొచ్చేస్తాయి. అందుకే - మీరు తెచ్చిన పూలని కంటితో అయినా చూడకుండా - ఎవరికేనా యిచ్చేయ్యడమో, అలా కుదరకపోతే అవతల పారేయడమో చేస్తున్నాను. నేను... చివరకి... దేవుడికి పూజకూడా పూలతో చేయను. సారీ..."

హతాశుడంటారే... అలాగే అయ్యాను నేనామె మాటలకి. ప్రపంచం... జీవితం... అంధకార బంధురమే ఐపోయాయామె చెప్పింది వినేసరికి. ఆడవాళ్లకే, పూలకీ అతి దగ్గరి సంబంధం. నేను కోరుకున్నది అతి సామాన్యమైన కోరికే తప్ప అసాధారణమయినదేమీ కాదు. అవీ తీరకపోతే యింక జీవితమెందుకు?

"పువ్వులంటే కూడా అలర్జీ ఉండే వాళ్లుంటారా ఆడవాళ్లు?" ఎలాగో అడిగాను. "అలర్జీకి అర్థమూ ఉండదు, కారణమూ ఉండదు. అదంతే. మా అక్కయ్యకి బంగారమంటే ఎలర్జీ. చచ్చినాపడదు. అది - మంగళసూత్రం బంగారంది పెట్టుకోదు. పసుపు కొమ్మే దారంతో కట్టుకుంటుంది. గాజు గాజులూ, ముత్యాలదండే వేసుకుంటుంది. మా వదినకి మంచినూనె పడదు. అంచేత యింట్లో నువ్వుల నూనె బదులు వేరుశనగనూనె వాడుతుంది."

నాకు ఏడుపొచ్చేస్తూంది. పువ్వులు - పవిత్రత, ప్రణయం, శృంగారం, పరిమళం, పువ్వులు పెట్టుకోని భార్య!... సౌందర్యం, స్వచ్ఛత ఊహించుకోడానికే భయంకరంగా ఉంది. నా జీవితం నాశనమైపోయింది. నా.. అతిచిన్న... పూల కలలు రాలిపోయాయి. నా అతి చిన్నకోరిక వాడి వత్తులైపోయింది. ఈ జీవితంలో నా సమస్యకి పరిష్కారం వుండదు. నాకేది అత్యంత యిష్టమో - అది శ్రీమతికి అలర్జీ! తలనిండా పూలు పెట్టుకున్న భార్యతో కలసివెళ్లే భర్తని చూసి నేను ఈర్ష్యతో కుమిలి క్రుంగిపోవలసిందే. నేను శ్రీమతి మీద జాలిపడడం, నామీద సానుభూతి చూపుకోసం తప్ప మరేమీ చెయ్యలేను. ఎందుకంటే... ఆమె బాధ్యతలేని ఆ ఎలర్జీ తప్పిస్తే మిగిలిన అన్ని విషయాలలోనూ ఆమె అనువైనది. నేనంటే ప్రేమ. ఆమె మీద నాకూ ప్రేమే. కాని... మానవ జీవితంలో... దాంపత్య జీవితంలో... అతిముఖ్యమైన శృంగార విషయంలో మాత్రం నాకు బతుకంతా అసంతృప్తే. జీవితమంతా సర్దుకోడమే." అతని కంఠం విషాదంగానూ బరువుగానూ. పూజకి అతని మీద నిజంగా జాలేసింది.

"ఎవరికీ చెప్పుకోలేనిది నా బాధ. ఎవరికి చెప్పినా - యిది ఓ సమస్యేనా అని తేలిగ్గా తీసిపారేస్తారు. నా ముఖంమీదే నవ్వుతూ.."

"ఎలర్జీలకి కూడా ట్రీట్‌మెంట్ ఉందంటారు. మంచి డాక్టర్ని సంప్రదించండి..,"

"అలాగే. పూజా! నా సమస్యకి నవ్వుకోకండి. నేను మీ వెంట ఎందుకు పడ్డానంటే - మీ పూలజడ చూసి వొళ్లు మరిచి. ఇప్పుడు నేను మిమ్మల్నింకేమి చేయకుండా ఎందుకు వెళ్లిపోతున్నానంటే - నా పూలకోరిక తీరింది కనుక.

గుడ్ నైట్ పూజా! ఈ పూలపండగ జీవితాంతం జ్ఞాపకముంటుంది నాకు -"

అతను వెళ్లిపోతూంటే - ఆమె ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది. ఆమెతోపాటు - కిటికీ అవతల యిద్దరిదీ అదే పరిస్థితి.

ఆమె జడలోనూ... ఒంటినిండా మిగిలిన పువ్వులు...

మంచంమీదా నేలమీదా పడిన పువ్వులు...

జాలిగా నవ్వుతున్నాయి.

■

### సంజయ్ చిత్రంలో రేఖ?

*'దేవ్‌దాస్' దర్శకుడు సంజయ్ లీలాభన్సాలి తనిప్పుడు తీస్తున్న 'బాజీరావ్ మస్తానీ' ఒక ముఖ్యపాత్ర చేసేందుకు మేడమ్ రేఖను తీసుకున్నట్లు వినిపిస్తోంది. ఆ సంగతే సంజయ్ నడిగితే, నవ్వేసి, "ఊహించుకుంటూ వుండండి!" అన్నాట్ట. ఆ చిత్రం గురించి విడుదలయ్యే సమయం దాకా ఏమీ చెప్పకూడదనేది అతని నియమము. మరి రహస్యం ఎప్పుడో బయటపడేది?*